## క్లుప్తంగా

### వివేకానంద సంస్థ వితరణ



గ్రామ పెద్దల చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు అందిస్తున్న సంస్థ సభ్యులు

**డాబాగార్డెన్స్:** స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తిక్కవానిపాలెం పేద ప్రజలకు ఆదివారం దుప్పట్లు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ గ్రామాల్లోని పేదలకు సేవలందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. గ్రామ పూజారి తిక్కడ సత్యనారాయణ, గ్రామ పెద్దలు సూరాడ సత్తయ్య, చంద్రయ్య, పోలయ్య, దూడ సోమినాయుడు, చేపల అప్పలరాజు, రాజబాబు తదితర గ్రామ పెద్దల చేతుల మీదుగా దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సత్తిబాబు, పోలవరపు అప్పలకొండ, దూడ రాజు తదితరులు పాల్గొన్నారు.

### నిరాశ్రయుల గృహంలో వైద్య శిబిరం



నిరాశ్రయులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**డాబాగార్డెన్స్:** సత్యసాయి సేవా ఫౌండేషన్ సహకారంతో సౌత్ జైల్‌రోడ్డు భీమ్‌నగర్‌లో గల నిరాశ్రయుల గృహంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ కుప్పిలి సురేష్‌బాబు, డాక్టర్ లక్ష్మీరాజ్యం పాల్గొని, నిరాశ్రయులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో నిరాశ్రయుల గృహం ప్రతినిధులు వాసు, భాస్కర్, పార్వతి, జ్యోతి, సాయిబాబా ట్రస్ట్ సభ్యులు సురేష్, రాజేష్, కృష్ణమోహన్, కుమార్, రెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

### శ్రీచైతన్యలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం



విద్యార్థుల నృత్య ప్రదర్శన

**డాబాగార్డెన్స్:** రాంనగర్‌లోని శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని అకడమిక్ కోఆర్డినేటర్ రాజేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశలో పదో తరగతి ప్రాముఖ్యత, భవిష్యత్ కార్యాచరణ వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు పాఠశాల ఏజీఎం ఎంవీ సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ అప్పారావు, ఇన్‌చార్జ్‌లు చంద్రశేఖర్, నారాయణరావు, స్వామినాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి మహిళలకు ఆటల పోటీలు

**మురళీనగర్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో వివిధ అంశాల్లో మహిళలకు పోటీలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో మహిళలకు వంటలు, నడక, క్విజ్, మ్యూజికల్ చైర్ వంటి ఆటల పోటీలు జరుపుతామన్నారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మిల్లెట్ మహారాణి అనే అంశంలో వంటల పోటీలు సోమవారం సాయంత్రం 4 గంటలకు మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొనే వారు 94902 22662, 97012 47506 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవచ్చు.



# పాహిమాం.. పోలమాంబ

- కనులపండువగా ప్రారంభమైన పరస మహోత్సవాలు
- అమ్మవారి ప్రతిమలు, జల కలశాలతో భారీ ఊరేగింపు
- వీధుల్లో కోలాట బృందాలు, పులి వేషాల సందడి



ఉత్సవంలో కోలాటం సందడి



అమ్మవారి ప్రతిమలు, కలశాలతో ఊరేగింపు



ఆకట్టుకున్న పులి వేషాలు

**డాబాగార్డెన్స్:** పోలమాంబ అమ్మవారి పరస మహోత్సవాలు ఆదివారం కనులపండువగా మొదలయ్యాయి. జీవీఎంసీ 36వ వార్డు మంథా వారి వీధిలో కొలువుదీరిన అమ్మవారి ఆలయంలో ఉదయం 6 గంటలకు ప్రారంభ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు జల కలశాలతో, అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు నిర్వహించారు. పులి వేషాలు, మహిళల కోలాటం అలరించాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గురు భవానీ నారాయణ, గుత్తు రత్నం, కర్రి అప్పలనరసమ్మ, మామిడి సన్యాసిరావు, బాదం రవి, కోట్ల శంకరరావు, బంక వాసు, ఎస్ జనార్దన్, సాలపు నాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**నేడు తొలేళ్ల పండగ :** పోలమాంబ తొలేళ్ల పండగ సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు ప్రారంభ పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్ర అర్చన, జోగి కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి సన్నిధానంలో కుంకుమార్చన, అమ్మవారి సారె ఊరేగింపు ఉంటుంది.

**రేపు జాతర :** ప్రధాన పండగను పురస్కరించుకుని మంగళవారం జాతర నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు కుంకుమ పూజలు, పుష్పాలంకరణ ఉంటాయి. సాయంత్రం అగ్నిగుండం తొక్కడం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పులివేషాలు, తప్పెటగుళ్లు, తాడేపల్లిగూడెం బృందంచే కాంతార సెట్టింగ్, ఆర్కెస్ట్రా తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఉమామహేశ్వర ఆలయం, పోలమాంబ అమ్మవారి సేవా సంఘం ప్రతినిధులు, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దమరశింగు కనకారావు, కార్యదర్శి గుడివాడ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరగాని శంకరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

## 108 వంటకాలతో దుర్గాలమ్మకు నివేదన



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ విల్లూరి తదితరులు



అమ్మవారికి నివేదించిన 108 రకాల వంటకాలు

**డాబాగార్డెన్స్:** నగరంలోని పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి అష్టోత్తర శత పదార్థ నివేదన(108 రకాల వంటకాలతో నివేదన) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాటిని ప్రసాదంగా భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రారంభించారు. ఐదు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు 108 రకాల పిండి వంటలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నివేదించారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, ధవళ లక్ష్మీనారాయణ, కాంద్రేగుల రూపావతి, సారిపిల్లి వెంకటలక్ష్మి, దశమంతుల వేణుగోపాల్, యాల్ల రమణమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడు ఆర్‌పీహెచ్.కృష్ణ(అర్చకుడు), రాంబాబు పాల్గొన్నారు.

## నీలమ్మ వేపచెట్టు అమ్మవారి సన్నిధిలో వాసుపల్లి



నీలమ్మవేపచెట్టు అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

**అల్లిపురం:** ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం అస్సెంగార్డెన్స్‌లో వెలసిన నీలమ్మవేపచెట్టు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, సభ్యులు లక్ష్మీకాంతం, కన్నూరు గంగ, భీమరశెట్టి చంద్రకళ, బల్లిగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడారి వెంకటమహేష్, సచివాలయం కన్వీనర్లు కొల్లి సత్యవతి, బొర్రా శ్రీనివాసరెడ్డి, ఆర్పీలు జామి జ్యోతి, పెదిరెడ్ల మహేష్, పీలా మహేష్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

## కేజీహెచ్‌లో రహదారులకు మహర్దశ



ఆంధ్రా మెడికల్ కాలేజీ మహిళా హాస్టల్ నుంచి మార్చురీ వరకు కొత్తగా వేస్తున్న రోడ్డు



కార్డియాలజీ నుంచి గైనిక్ విభాగం వరకు వేసిన రోడ్డు

**మహారాణిపేట:** కింగ్ జార్జి ఆస్పత్రిలో రహదారులకు మహర్దశ పట్టింది. ఆస్పత్రిలో అంతర్గత రహదారులు దెబ్బతినడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడేవారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుంచి 27 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.ఎ.నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మథరావు రోడ్ల నిర్మాణం చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు చేసి, మరికొన్ని ప్రాంతాల్లో కొత్తగా రోడ్లు వేశారు. నర్సింగ్ కాలేజీ ఏరియాలో రోడ్లు యుద్ధ ప్రతిపాదికన నిర్మించారు. దాదాపు ఒక కిలో మీటరు వరకు రోడ్లు వేశారు ఆంధ్రా మెడికల్ కాలేజీ మహిళా హాస్టల్ నుంచి మార్చురీ వరకు, కార్డియాలజీ నుంచి గైనిక్ విభాగం వరకు రోడ్లు వేశారు. కొత్త రహదారుల్లో వేగ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేశారు. రహదారులు బాగుపడడంతో ద్విచక్రవాహనచోదకులు, పాదచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉద్యోగ సంఘాల నాయకులతో ముఖాముఖి

**డాబాగార్డెన్స్:** ఉద్యోగ సంఘాల నాయకులతో ఎల్లమ్మతోట సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పీడీఎఫ్ మద్దతు అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏ ఒక్క పార్టీ కూడా కృషి చేయలేదన్నారు. గత ఆరేళ్లుగా శాసనమండలిలో ఈ ప్రాంత అభివృద్ధిపై మాట్లాడింది ఏమీ లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుపై శాసనమండలిలో ప్రశ్నించే, నిలదీసే గొంతు ఉండాలన్నారు. రమాప్రభ మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటుతో తనను గెలిపించాలని అభ్యర్థించారు.

# చిరుధాన్యాలు ఆరోగ్యకరం



మాట్లాడుతున్న మిల్లెట్స్ క్యాంపైనర్ రాంబాబు

**సీతంపేట:** చిరుధాన్యాలు ఆరోగ్యకరమని మిల్లెట్స్ క్యాంపైనర్ రాంబాబు అన్నారు. గురుద్వారా సమీపంలోని ఒక హోటల్‌లో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని ఎలా తయారు చేయాలో అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలను నానబెట్టి వండుకోవాలని సూచించారు. వాటిని వండినపుడు వచ్చే గంజి తర్వాత రోజు తీసుకోవడం చాలా ఆరోగ్యకరమైనదని వివరించారు. అల్లం, వెల్లుల్లి, మజ్జిగ మంచి బాక్టీరియాను పెంచుతాయన్నారు. చిరుధాన్యాలను నానబెట్టి ఎండలో నేత వస్త్రంపై ఆరబెట్టి వాటిని పిండి చేసుకోవడం మంచిదన్నారు. బాగా పాలిష్ చేసిన ఆహార ధాన్యాలు ఆరోగ్యానికి మంచివి కాదన్నారు. సముద్ర ఉత్పత్తుల్లో ఎక్కువగా విష తుల్య రసాయనాలు ఉంటున్నాయని తెలిపారు. చద్దన్నం తినడం మంచి అలవాటని, రాగులతో చేసిన హల్వా వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. తెల్లవారిన ఎండ మంచిదని, గానుగ నూనె శరీరానికి రాసుకుని కాసేపు ఎండలో ఉండి స్నానం చేయడం ఆరోగ్యకరమని వివరించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు దాట్ల వర్మ, అశోక్, ఎం.యుగంధర్‌రెడ్డి, జె.వి.రత్నం, రుషి తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా
- ఉత్సాహంగా ఆనంద మేళా



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సిన్హా

**పరవాడ:** భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహుతులకు స్వాగతం పలికారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు దీపిక లేడీస్ క్లబ్ సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య రూపాలు, సాంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందారు.

## సత్ప్రవర్తనతో మెలగండి

**సీతమ్మధార:** ఫోర్త్ టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐలు శ్రీనివాసరావు, సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. గతాన్ని వీడి కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు. ఆలయ అర్చకుడు పవన్ తదితరులు ఈ సేవ నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**వైభవంగా నిత్యకల్యాణం :** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కల్యాణం జరిపించారు.

## ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం



దీక్షలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి, నాయకులు

**సీతమ్మధార:** ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం కాకుండా రక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరాహార దీక్షలు 675వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి లభించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు కూడా ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమవంతు పాత్రను పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయని గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం కూడా అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు శివాజీ, ఏపీ పరిరక్షణ జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి జగన్ మురారి, తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి రాజు

**అల్లిపురం:** బంగారుమెట్ట శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి పిల్లలు ఒక సమూహంగా ఏర్పడి పుస్తకాలు చదువుతూ, ఒకరికొకరు వివరించుకుంటూ విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో బొమ్మరిల్లు, చందమామ వంటి పుస్తకాలతో పాటు కామిక్స్, విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లలు శ్రద్ధతో చదివి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. మహిళలకు అవసరమైన నవలలు అద్దె ప్రాతిపదికన ఇంటికి తీసుకెళ్లవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేణుక యల్లమ్మ జాతరకు సర్వం సిద్ధం

- నేడు తొలేళ్ల పండగ
- రేపు ప్రధాన పండగ



రేణుకా యల్లమ్మ అమ్మవారు

**అల్లిపురం:** అచ్చియ్యమ్మపేట దరి కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తునట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. 27వ తేదీ సోమవారం అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా తొలేళ్ల కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. మృగశిర నక్షత్రం ప్రవేశ సమయంలో అమ్మవారిని సాముగరిడీలు, డప్పు వాయిద్యాల నడుమ తోడ్కొని వస్తామన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి తొలిపూజ ఆలయ గౌరవాధ్యక్షుడు పీలా అప్పలనాయుడు దంపతులచే నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం తెలిపారు. మరుసటి రోజు 28వ తేదీ మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజాము నుండి విశేష పూజలు, అభిషేకాలతో పాటు ఉదయం 10 గంటలకు అమ్మవారికి కలశాలతో మహిళలు అచ్చియ్యమ్మపేటలో గల పోలేరమ్మ హుండీ వద్ద నుంచి తిరువీధిగా వచ్చి అమ్మవారి మూలవిరాట్టును ఆ జలాలతో అభిషేకిస్తారని తెలిపారు. సాయంత్రం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు.

## నేటి నుంచి సీతంరాజుకు మద్దతుగా ప్రచారం

**డాబాగార్డెన్స్:** వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిల్చున్న సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులతో వాసుపల్లి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు 35వ వార్డు పరిధి దుర్గాలమ్మ గుడి వద్ద ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభించనున్నట్లు చెప్పారు. 28న 34వ వార్డు, మార్చి ఒకటిన 41, 42 వార్డులు, 2న 39వ వార్డు, 3న 33, 27 వార్డులు, 4న 31, 29 వార్డులు, 6న 32వ వార్డు, 7న 36వ వార్డు, 8న 37, 9న 38వ వార్డు, 10న 30వ వార్డులో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా రోజుల్లో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**2న అభ్యర్థితో సమావేశం**

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ మార్చి 2న దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులతో సమావేశం కానున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి తెలిపారు. జిల్లా పరిషత్ సమీపాన ఉన్న అంకోశా హాల్‌లో ఈ సమావేశం జరగనుందన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ద్వారకా జోన్ ఏసీపీ మూర్తి హెచ్చరిక
- ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి తదితరులు

**ఎంవీపీ కాలనీ:** ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ద్వారకా జోన్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను ఎంవీపీ స్టేషన్‌కు ఆదివారం పిలిచి ద్వారకా జోన్ ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి పలు హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేర ప్రవృత్తిని మార్చుకుని సమాజంలో బాధ్యతగల పౌరులుగా జీవించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## 'ఆలయం పేరుతో భూ ఆక్రమణ'

**సీతమ్మధార:** సీతమ్మధార కొండవాలు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయం పేరుతో హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ ఏఎస్ఎన్ రాజు భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని శ్రీనివాసరావు కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆక్రమిత స్థలం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992లో కో-ఆపరేటివ్ సొసైటీ పేరిట తమకు స్థలం ఇచ్చారని గుర్తు చేశారు. ఇటీవల దేవాలయ నిర్మాణం కోసం హనుమాన్ ట్రస్ట్ సభ్యులు దేవదాయ శాఖ నుంచి 300 గజాలకు అనుమతి తీసుకున్నారన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో మరో 400 గజాలు అదనంగా తీసుకుని పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి చేశారన్నారు. మొత్తం 700 గజాలే కాకుండా సుమారు 2000 గజాల వరకు తమ ప్లాట్‌లో నుంచి స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా పశ్చిమ దిశగా ఉన్న తమ స్థలానికి వెళ్లేందుకు దారి లేకుండా ఆక్రమించుకుంటూ పోతున్నారన్నారు. దీనిపై అనుమతుల కోసం దేవదాయ శాఖ జీవీఎంసీ అధికారులను సంప్రదించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. జిల్లా యంత్రాంగం, దేవదాయ శాఖ అధికారులు దృష్టి సారించి ఇక్కడ జరుగుతున్న భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని సొసైటీ సభ్యులు కోరారు.